క్లుప్తంగా

పండ్లతోటల పెంపకం సద్వినియోగం చేసుకోండి

చీరాల టౌన్: రైతులు పండ్లతోటలను పెంపకాలను చేసుకోవడం వలన వృద్ధి చెందుతారని, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం దాసు తెలిపారు. పండ్ల తోటల పెంపకాలకు కావాల్సిన సమాచారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఫీల్డు అసిస్టెంట్ల వద్ద ఉందని గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సన్నకార రైతులు, ఎస్సీ, ఎస్టీలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డ్, బ్యాంకు ఖాతా నకళ్లతో ఏఆర్ఈజీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఏపీవో దాసు సూచించారు.

స్మార్ట్ రేషన్ కార్డులు తప్పనిసరి

చీరాల టౌన్: ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్‌కార్డులు రేషన్ డీలర్ల వద్ద ఉన్నాయని విధిగా వాటిని తీసుకెళ్లాలని తహసీల్దార్ కె.గోపికృష్ణ తెలిపారు. చీరాల అర్బన్ పరిధిలోని, చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న రేషన్ డీలర్ల వద్ద ఉన్నాయని.. కార్డుదారులు వేలిముద్రలు వేసి తీసుకెళ్లాలని తహసీల్దార్ సూచించారు.

వాటర్ కూలర్ వితరణ



తహసీల్దార్ కార్యాలయంలో వాటర్ కూలర్ అందిస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు(చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో దాతలు మండల రెవెన్యూ కార్యాలయానికి వాటర్ కూలర్‌ను బహూకరించారు. శనివారం పర్చూరు మండల రెవెన్యూ కార్యాలయంలో రూ. 10 వేలు విలువ కలిగిన వాటర్ కూలర్‌ను వెలనాటి వెంకట్రావు ఆర్థిక సహాయంతో తహసీల్దార్ పి. బ్రహ్మయ్యకు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అందజేశారు. అసిస్టెంట్ గవర్నర్ నాగబైరు శ్రీనివాసరావు, కొల్లా సుబ్బారావు, కోట శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వనరులు వినియోగించుకోండి



కారంచేడులో చిన్నారులకు యూనిఫాం అందిస్తున్న ఎంఈఓ సత్యన్నారాయణ

కారంచేడు: గ్రామాల్లో దాతలు సమకూర్చే వనరులను సైతం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. శనివారం కారంచేడు మోడల్ స్కూల్ ఆవరణలో విద్యార్థులకు ఒక్కోరికి రెండు జతల చొప్పున యూనిఫాం పంపిణీ చేశారు. గ్రామ అభివృద్ధి కోసం ఏర్పాటు అయిన గౌతమ బుద్ద రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ బట్టల పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన అనిల్ గౌర హైదరాబాద్‌లోని స్టైల్ ఫౌండేషన్ సహకారంతో ఈ యూనిఫాంను అందించారని తెలిపారు. హెచ్ఎం సరోజని, పద్మావతి, పావులూరి శ్రీనివాసరావు, మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను వివరించండి



సమావేశానికి హాజరైన బల్లికురవ మండల నేతలు



బల్లికురవ మండల నేతలతో మాట్లాడుతున్న అశోక్ కుమార్

బల్లికురవ: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా వైఎస్సార్ సీపీ నేతలు, విలేకర్లపై అక్రమ కేసులు బనాయిస్తోందని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా ఉన్న గ్రామ, బూత్ కమిటీలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు పిడుగురాళ్లలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంలో అశోక్ కుమార్ మాట్లాడుతూ తన తుది శ్వాస వరకు అద్దంకి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని ప్రకటించారు. గ్రామాల వారీగా పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. మండల కన్వీనర్‌తోపాటు చింతలపూడిని కలిసినవారిలో కూకట్లపూడి సర్పంచ్ ఇప్పల అయ్యప్పరెడ్డి, కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి సొసైటీల మాజీ అధ్యక్షుడు దర్శి రామకృష్ణరావు, మంచాల శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల యూత్, రైతు బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళా విభాగం అధ్యక్షులు మక్కెన రవిబాబు, మేడగం శ్రీనివాసరెడ్డి, ఎ. సతీష్, ప్రత్తిపాటి అక్కులు, యం. హరికృష్ణనాయక్, కొయిలముడి శింగమ్మ, జాన్‌డీర్ సుబ్బారెడ్డి, జొన్నలగడ్డ రమేష్, బుర్రి వీరాంజనేయులున్నారు.

జ్వరాల గుప్పెట్లో జనం విలవిల

- దోమలకు కేంద్రాలుగా మారుతున్న గ్రామాల్లోని డ్రైనేజీలు
- జ్వర పీడితులతో నిండిపోతున్న ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులు



పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వరాలతో బాధపడుతున్న రోగులు

పర్చూరు (చినగంజాం): మండలంలో రోగాలు విజృంభిస్తున్నాయి. ఎక్కడ చూసినా చిన్నా పెద్దా తేడా లేకుండా జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. పర్చూరులోని ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులు జ్వరపీడితులతో కిక్కిరిసి పోతున్నాయి. ప్రయివేటు వైద్యులు పేదలను పీల్చి పిప్పిచేస్తున్నారు. ఆ ధాటికి ఎంతో మంది విలవిల్లాడుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం:



డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పై నుంచి వచ్చే మురుగు నీరు మా ఇళ్ళ దగ్గరే పేరుకు పోతోంది. మురుగు కాలువలు లేక పోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి పోతోంది. దాంతో దోమలు విపరీతంగా పెరిగి పోయి జ్వరాలు వస్తున్నాయి.

– సాకె నాగేంద్రం, పర్చూరు



పర్చూరులోని ఒకటో వార్డులో మురుగునీరు నిలిచిన కాలువ

సమస్య మూలాలు గ్రహించరా?

మండలంలోని పలు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోవడం, మురుగు కాలువల్లో నీరు నిలువ ఉండి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారడం, గ్రామాల్లోని కాలనీల్లో చిల్లచెట్లు విపరీతంగా పెరిగి పోయి మురుగు ఏర్పడటం.. దోమల వ్యాప్తితో ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాలతో అల్లాడిపోతున్నారు. తీవ్రమైన జ్వరాలు సోకి నియంత్రణ కాక పోవడంతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. పర్చూరు ప్రభుత్వ వైద్యశాల జ్వర పీడితులతో నిండిపోయి సిబ్బంది కష్టపడుతున్నా నియంత్రణ చేయలేక పోతున్నారు.

స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర చేపట్టినా ప్రయోజనం శూన్యం

గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేందుకు రోగాల బారిన పడుతున్న ప్రజలను రక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర అనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ప్రతి నెలా మూడో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా ప్రణాళిక తయారు చేశారు. ప్రతి నెలా ఒక్కొక్క అంశాన్ని చేపడుతూ 2025 సెప్టెంబర్ నెల అంశంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

పిల్లలు జ్వరాల బారిన పడి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు:



మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడం, చిల్లచెట్లు విపరీతంగా పెరిగి పోవడం, పారిశుద్ధ్యం గురించి పట్టించుకోక పోవడంతో దుర్వాసన వెదజల్లుతూ, దోమలు విపరీతంగా పెరిగి పోతూ చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఎన్నికలప్పుడు నాయకులు ఏదో చేస్తామని చెప్పారు కానీ చేయలేదు. మేము ఇబ్బందులు పడుతన్నాం.

– ఎస్. వెంకట రమణ, పర్చూరు

జ్వరాలతో ఎన్నోసమస్యలు ఎదుర్కొంటున్నాం



గ్రామాల్లో జ్వరాలు తీవ్రంగా పెరిగిపోయి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లాలంటే వైద్య ఖర్చులు భరాయించ లేకపోతున్నాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నాం. ఒక్కసారిగా జ్వరాలు ప్రబలి పోవడంతో చాలా ఇబ్బందిగా ఉంది.

– మస్తాన్‌వలి, పర్చూరు

పర్చూరులోని పారిశుద్ధ్య కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించి తమను ఆదుకోవాలని, జ్వరాలతో బాధలు పడుతున్న తమను ఆదుకోవాలని పర్చూరు మండలంలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి



పావులూరులో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి పిలుపు నిచ్చారు. పావులూరులోని ఆయన నివాస గృహంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో శనివారం పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజంట్‌ల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ స్థాయిలో గ్రూపులకు తావివ్వకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని, పార్టీ అభివృద్ధి కోసం ముందుకు సాగాలన్నారు. సాధారణ ఎన్నికలు ఏ సమయంలో వచ్చినప్పటికీ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, జెడ్పీటీసీ భవనం శ్రీలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ భవనం శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ నూతలపాటి బలరాం, ప్రభుదాసు పాల్గొన్నారు.

పశుపోషకులు సద్వినియోగం చేసుకోండి



గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశు వైద్యాధికారి వేణుగోపాల్

పర్చూరు(చినగంజాం): పశువులకు గాలి కుంటు వ్యాధి నుంచి తట్టుకునేందుకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని బాపట్ల జిల్లా పశువైద్యాధికారి బి. వేణుగోపాల్ సూచించారు. జాతీయ పశువ్యాధి నిరోధక పథకంలో భాగంగా పర్చూరు గ్రామంలో పశువులకు నిర్వహించే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నుంచి అక్టోబరు 15 వరకు నిర్వహిస్తున్న దృష్ట్యా పశుపోషకులంతా తమ నాలుగు నెలల దూడల నుంచి అన్ని పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోవాలని కోరారు. ఉచితంగా నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పశు పోషకులు వినియోగించుకోవాలన్నారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకితే పాలు తగ్గడం జ్వరం, మేత మేయక పోవడం జరుగుతుందన్నారు. రైతులంతా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పర్చూరు ఏడీ డి. మాధవి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సెపక్ తక్రాలో విజేతలుగా నిలవాలి



క్రీడాకారులను అభినందిస్తున్న డాక్టర్ ఇస్తర్ల బాబూరావు

చీరాల రూరల్: క్రీడలకు తనవంతు సహకారం ఎల్లవేళలా అందిస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్యుల విభాగం రాష్ట్ర కార్యదర్శి, సెపక్ తక్రా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఇస్తర్ల బాబురావు అన్నారు. అనంతపురంలో ఆది, సోమవారాల్లో రాష్ట్ర స్థాయి 28వ సబ్ జూనియర్ బాల, బాలికల సెపక్ తక్రా పోటీలు జరుగనున్నాయి. పోటీల్లో పాల్గొనే బాపట్ల జిల్లా సెపక్ తక్రా బాలికల జట్టు క్రీడాకారిణిలను జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాబురావు శనివారం తన హాస్పటల్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన జట్టులోని ప్రతి క్రీడాకారిణి గురించి అడిగి తెలుసున్నారు. వారి వ్యక్తిగత ప్రతిభ గురించి ఆరా తీశారు. పోటీలో పాల్గొని మెరుగైన ఆట తీరును ప్రదర్శించి విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు తనవంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ జి. మాధవీలత, పిడి బొనిగల యశోద కృష్ణ, బాపట్ల జిల్లా బాలికల జట్టు కోచ్ కోడిరెక్క ధనలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్ర ఉన్నారు.

అద్దంకిలో వర్షం

అద్దంకి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా పలు ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శనివారం అద్దంకిలో భారీ వర్షం కురిసింది. ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతం కావడం, వెంటనే వర్షం ప్రారంభం అయింది. సాధారణంగా వర్షం పడకపోయినా ఉపరితల ఆవర్తనతోనైనా వర్షాలు పడుతండడంతో ఖరీఫ్ రైతు ఆనదం వ్యక్తం చేస్తున్నాడు. కంది, జూట్, తదితర పంటలకు ఈ వర్షం ప్రాణం పోస్తుందని చెబుతున్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకోండి

చీరాల రూరల్: క్షయవ్యాధి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ముందుగానే గుర్తించినట్లయితే పూర్తిగా నిర్మూలించవచ్చునని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల పర్యవేక్షకుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో శనివారం స్వస్త్ నారీ- స్వశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభించారు.

రక్తదానం గొప్పది

చీరాల రూరల్: అన్ని దానాల్లోకెల్లా రక్త దానం గొప్పదని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. రక్తదాన మాసోత్సవాల్లో భాగంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలోని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కాత్యాయి, న్యాయవాది బూదరాజు శశికిరణ్, రమేష్‌బాబు, మేరుగ రవికుమార్ పాల్గొన్నారు

ఉచిత పంపిణీకి మొక్కలు సిద్ధం



బబ్బేపల్లి నర్సరీ వద్ద రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్

మార్టూరు: అటవీ శాఖ తరఫున రైతులకు మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని కూకట్ల పల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ బాబు తెలిపారు. బబ్బేపల్లి, రాజుగారి పాలెం గ్రామాల కొండ సమీపంలో నిర్వహిస్తున్న నర్సరీ కేంద్ర వద్ద ఆయన శనివారం స్థానిక రైతులతో మాట్లాడారు. పర్యావరణ సమతుల్యం కోసం ప్రజలచే వృక్షాలను పెంచడం కోసం నర్సరీని ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం రైతుల కోసం 40 వేల మొక్కలు పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు. జామ, సీతాఫలం, వెదురు, అవిస, బాదం, ఉసిరి, వేప, గానుగ, పనస, చింత తదితర మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పది మొక్కల లోపు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు చూపించి నేరుగా మొక్కలు తీసుకువెళ్లవచ్చని తెలిపారు. 10 నుంచి 5వేల మొక్కలు వరకు ఎంపీడీవో ద్వారా జిల్లా అటవీ శాఖ, బాపట్ల వారి పేరుతో లెటర్ తీసుకొని రావాలని సూచించారు.

మొక్కలు పర్యావరణ నేస్తాలు



మొక్కలు నాటుతున్న వైద్యులు చంద్రశేఖర్, గ్రామ పెద్దలు

పర్చూరు(చినగంజాం): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని దానిని అలవాటుగా చేసుకోవాలని మండలంలోని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ సూచించారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర గ్రీన్ ఏపీలో భాగంగా ఉప్పుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో ఒక మొక్క నాటాలని అదే విధంగా టెర్రస్‌పై కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్ల మొక్కలు పెంచాలని తద్వారా ఇంటి ఉష్ణోగ్రత తగ్గడమే కాకుండా ఎలాంటి క్రిమి సంహారక మందులు లేని కూరగాయలు, పండ్లు లభ్యం అవుతాయన్నారు. మానసిక ఉల్లాసానికి, శారీరక వ్యాయామానికి పక్షులు జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడానికి దోహద పడుతుందని, వాతావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. అంతే గాకుండా ఇంటిలో ఉత్పన్నమయ్యే తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చడం ద్వారా మొక్కలను చక్కని ఎరువుగా ఉపయోగ పడడమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని కూడా తగ్గిస్తుందని తెలియజేశారు. వీలైనంత వరకు చెట్లను నరకడం మానేసి మొక్కలను పెంచే పనిలో ఉండాలన్నారు. సర్పంచ్ ఎర్రాకుల తిరుమలేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ అందజేత

చినగంజాం: దసరా సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేయకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయుడు సిద్ధం నాగమల్లేశ్వరరావు మెటీరియల్ పంపిణీ చేశారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ రామచంద్రనగర్ ఎంపీపీ పాఠశాలకు చెందిన చిన్నారులకు ఎఫ్ఏ 2 సిలబస్‌కు సంబంధించిన ప్రాక్టీస్ వర్క్‌షీట్‌ను శనివారం అందజేశారు.

హుండీ ఆదాయం రూ. 35 వేలు

అద్దంకి రూరల్: శింగరకొండ పై వేంచేసి ఉన్న లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన హుండీని శనివారం లెక్కించారు. మార్చి 15 నుంచి సెప్టెంబర్ 20 వరకు హుండీ ఆదాయం రూ. 35,165 వచ్చినట్లు ధర్మకర్తల మండల అధ్యక్షుడు జి. శ్రీనివాసరావు తెలిపారు. దేవాదాయ శాఖ అద్దంకి డివిజన్ పరిశీలకులు ఎం. వెంకటేశ్వరరావు, ఈఓ యం. శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న చిన్నారుల దసరా వేషధారణ



ప్రత్యేక వేషధారణలో చిన్నారులు

అద్దంకి: దసరా పండగ పురస్కరించుకుని పట్టణంలోని లక్కరాజు రామయ్య ప్రాథమిక పాఠశాలలో శనివారం చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలకు దసరా పండుగ ప్రతీక అని ఉపాధ్యాయులన్నారు. ప్రధానోపాధ్యాయినితో పాటు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంతో లాభం



స్వర్ణపాలెంలో అవగాహన కల్పిస్తున్న బాపట్ల జిల్లా మేనేజర్ అక్తర్ హుస్సేన్

కారంచేడు: ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం నుంచి అందించే ఉత్తమమైన సేవలను అవసరమైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల జిల్లా మేనేజర్ సయ్యద్ అక్తర్ హుస్సేన్ అన్నారు. శనివారం మండలంలోని స్వర్ణపాలెంలో అభ్యుదయ రైతు యేషయా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు, పద్ధతులతో మీ భూమి సారవంతంగా మారుతుందన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించడం వలన ప్రజలు కూడా ఎంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. అవకాశం ఉన్న ప్రజలు తమకు ఉన్న కొద్ది పాటి స్థలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసే కూరగాయలను పండించుకోవచ్చని సూచించారు. పచ్చిరొట్ట, కూరగాయలు, అంతర పంటలకు అవసరమైన విత్తనాలు, కిట్లు, జీవ ఉత్ప్రేరకాలు, అమృతాలు, కషాయాలు ఈ వ్యవసాయ కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం మార్కెటింగ్ సర్టిఫికేషన్ ఎన్ఎఫ్ఏ బీవీ శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్స్ అప్పారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థే!



సమావేశంలో మాట్లాడుతున్న కాంప్లెక్స్ చైర్మన్ దేవేంద్రరావు

యద్దనపూడి: తరగతి గదిలోని ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థేనని, ఉపాధ్యాయులు తమ జ్ఞానాన్ని నిరంతరం పెంచుకుంటూ విద్యార్థులకు సులభతరంగా పాఠ్యాంశాలను బోధించాలని కాంప్లెక్స్ చైర్మన్ ఎం. దేవేంద్రరావు అన్నారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠశాల సముదాయ సమావేశాన్ని నిర్వహించారు. ఏ నెల సిలబస్ ఆ నెలలోనే తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి ప్రత్యేక బోధన చేయాలన్నారు. పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు పాఠశాలకు ఎందుకు రాలేదని తల్లిదండ్రులను అడిగి తెలుసుకొని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.